క్లుప్తంగా...

అమీర్‌పేటలో బస్తీబాట-బీజేపీ భరోసా

అమీర్‌పేట: మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బస్తీబాట-బీజేపీ భరోసా కార్యక్రమాన్ని మంగళవారం అమీర్‌పేటలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ ప్రారంభించారు. ఇంటింటికి తిరుగుతూ స్థానికంగా ఉన్న సమస్యలు తెలుసుకోవడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్నట్లు అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ తెలిపారు. మొదటి రోజు బాపూనగర్, ఈడబ్ల్యూఎస్ కాలనీలో పర్యటించినట్లు ఆమె వెల్లడించారు.

టాయిలెట్ క్లీనింగ్ మిషన్ వితరణ



టాయిలెట్ క్లీనింగ్ మిషన్ అందజేస్తున్న కేతినేని సరళ

సనత్‌నగర్: ఎస్‌ఆర్‌టీకాలనీలోని ప్రభుత్వ రౌండ్‌టేబుల్ పాఠశాలకు బీజేపీ నాయకులు టాయిలెట్ క్లీనింగ్ మిషన్‌ను అందజేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సహకారంతో సమకూర్చిన మిషన్‌ను మంగళవారం అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రాంతికుమార్, రవీందర్, దయానంద్, శ్రీశైలంగౌడ్, హృషికేశ్, చంద్రకుమార్, రాజనీష్‌కుమార్, సునీల్, శ్రీనివాస్‌యాదవ్, సరితాగౌడ్, మురళి, సుబ్బారావు పాల్గొన్నారు.

కుమ్మిన వాన



లాలాపేట: దినమంతా భగభగ మండే ఎండలు.. సాయంత్రం ఉన్నట్టుండి వాతావరణం చల్లబడి రాత్రి కుండపోత వర్షం కురిసింది. లాలా పేట, శాంతి నగర్, తార్నాక ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి నాలాలు పొంగి ఇందిరానగర్, సత్యానగర్ వంటి లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. లాలాపేటలో ప్రతి మంగళవారం వారాంతపు సంత జరుగుతుంది. ఒక్కసారిగా వర్షం కురవడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు పడ్డారు. ఈదు రు గాలులతో కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

చీరకట్టు .. అదిరేట్టు



అందాల ముద్దుగుమ్మలు చీరకట్టులో సంప్రదాయాన్ని ఒలకబోశారు. రంగురంగుల చీరలు ధరించి హొయలొలికించారు. చీర ఔన్నత్యాన్ని చాటుతూ వయ్యారి నడకలతో ర్యాంప్‌పై మెరిశారు. బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో మంగళవారం ఎస్‌వీఎస్ గ్రూప్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అనంత పేరిట నూతన బ్రాండ్ చీరలను విడుదల చేశారు. ఆదిత్య బిర్లా గ్రూప్‌కు చెందిన లివా ఫ్యాబ్రిక్, మీనా ప్రింట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ల సహకారంతో సరికొత్త బ్రాండ్‌తో ఆకర్షణీయమైన చీరలను మార్కెట్లోకి విడుదల చేయడం జరిగిందని ఎస్‌వీఎస్ గ్రూప్ ప్రతినిధులు చింతల శ్రీనివాస రావు, రమేష్, సురేష్ తెలిపారు. బిర్లా సెల్యులోస్ గ్రాసిమ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సీఎంఓ మన్మోహన్‌సింగ్, ఏవీపీ బిజినెస్ డెవలప్‌మెంట్ ప్రియాంక ప్రియదర్శిని, మీనా ప్రింట్స్ ఎండీ భరత్ పాల్గొన్నారు

–సనత్‌నగర్

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్: తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో అద్భుతమైన పాలన కొనసాగుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్ మహబూబ్ కాలేజీ ఆవరణంలో మంగళవారం ఏర్పాటు చేసిన సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. సమాజంలో అన్ని వర్గాల కోసం అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ముందుకు సాగుతున్న ఘనత సీఎం కేసీఆర్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూలేని విధంగా కోట్లాది రూపాయల వ్యయంతో అనేక ప్రజాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందన్నారు. ఉచిత కరెంట్, సాగునీరు, తాగునీటితో పాటు పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సాయం ఇస్తున్న ప్రభుత్వం దేశంలో ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజల్లో ఉంటూ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు వారి సమస్యల పరిష్కారానికి అండగా ఉండాలని సూచించారు. గులాబీ జెండా మీ అందరికి అండగా ఉంటుందని, నాయకులు, కార్యకర్తలకు నేను అన్ని విధాలా అండగా ఉంటూ ఆదుకుంటానన్నారు. పవన్‌కుమార్ గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు దాసోజు శ్రావణ్‌కుమార్, కట్టెల శ్రీనివాస్ యాదవ్, పీఎల్ శ్రీనివాస్, కార్పొరేటర్లు హేమలత, మహేశ్వరీ, లక్ష్మీబాల్‌రెడ్డి, తలసాని సాయికిరణ్ యాదవ్ మాట్లాడారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలను సమావేశంలో నాయకులు బలపరుస్తూ ఆమోదించారు. అంతకు ముందు మంత్రి పార్టీ జెండాను ఆవిష్కరించి సనత్‌నగర్‌లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, శ్రీనివాస్ గౌడ్, వెంకటేశన్, లక్ష్మీపతి, ఏసూరి మహేష్, వెంకటరమణ, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రెడ్డి, డి. జనార్దన్, ఫయూమ్, అబ్బాస్, ప్రేమ్, సుధాకర్‌రెడ్డి, ముక్కా శ్రీనివాస్ పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన కార్యకర్తలు, నాయకులు

బీఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి

● డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధించిందని శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. మంగళవారం సీతాఫల్ మండిలోని మల్టీపర్పస్ కమ్యూనిటీహాల్లో జరిగిన సికింద్రాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రాష్ట్రంలో ఓ వైపు అభివృద్ధి పనులను విస్తృతంగా చేపడుతూనే, మరోవైపు సంక్షేమ పథకాల శకం ప్రారంభమైందన్నారు. పేద ప్రజలు, రైతుల సంక్షేమం కోసం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను అమలు చేసేదిశగా వివిధ రాష్ట్రాలు కసరత్తు చేస్తున్నాయన్నారు. రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు వంటి పథకాలతో రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తున్నాయన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో సైతం 50 ఏళ్లుగా జరగని అభివృద్ధి పనులు గడచిన పదేళ్లలో చేపట్టామన్నారు. నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పరిపాలన దక్షత ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం గణనీయమైన ప్రగతి సాధించిందని రానున్న ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఘన విజయం సాధించి కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం సంక్షేమ పథకాలను అమలులోకి తెస్తుంటే కొన్ని వర్గాల రిజర్వేషన్లను రద్దు చేస్తామని కేంద్ర మంత్రులు మాట్లాడుతున్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత, కంది శైలజ, లింగాని ప్రసన్నలక్ష్మి, నాయకులు మోతె శోభన్ రెడ్డి, కంది నారాయణ, కరాటే రాజు, లింగాని శ్రీనివాస్, జలందర్‌రెడ్డి, రాజసుందర్, గరికపోగుల చంద్రశేఖర్,మల్లూరి అనిల్ పాల్గొన్నారు.

ఈటలకు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

లాలాపేట: భాగ్యలక్ష్మీ అమ్మవారి వద్ద ప్రమాణం అంటూ టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి దొంగ నాటకాలు ఆడుతున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. తార్నాక డివిజన్ లాలాపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి గత చరిత్ర ప్రజలందరికి తెలుసని బ్లాక్ మెయిల్ రాజకీయాలతో ఏ స్థాయి నుంచి ఈ స్థాయికి వచ్చావో ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. తెలంగాణ ఉద్యమంలో జైలు పాలైన ఉద్యమకారులను విడిపించేందుకు తన సొంత ఆస్తులు అమ్మి బెయిల్‌లకు డబ్బులు పెట్టిన చరిత్ర ఈటల రాజేందర్‌ది అని అలాంటి ఉద్యమనాయకుడిపై రేవంత్‌రెడ్డి చేసిన వ్యక్తిగత విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ లోపాయికారిగా ఉంటూ తెలంగాణ రాజకీయాల్లో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశ్యంతో చేసిన వ్యాఖ్యలపై రేవంత్‌రెడ్డి ఎందుకు ఉలిక్కిపడుతున్నారన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ఈటలపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలన్నారు. ఈ సమావేశంలో గణేష్‌రావు, రాము వర్మ, హరి, పోచయ్య యాదవ్, భిక్షపతి, కుమార్ పాల్గొన్నారు.

ఆస్పత్రి ఏర్పాటుకు స్థలం కేటాయించాలి



రిలే దీక్షలో పాల్గొన్న మైనార్టీ నాయకులు

లాలాపేట: మాణికేశ్వర్‌నగర్‌లో ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని మాణికేశ్వర్‌నగర్ మైనార్టీ అసోసియేషన్ నాయకులు తెలిపారు. చేయి చేయి కలుపుదాం భవిష్యత్ తరానికి హాస్పిటల్ ఏర్పాటు చేద్దామంటూ మాణికేశ్వర్‌నగర్ కమాన్ వద్ద అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం నాటికి 21వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఓయూ నిర్మాణ సమయంలో వడ్డెర్ల అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని యూనివర్సిటీ అధికారులు స్వాధీనం చేసుకోవాలనే ప్రయత్నాలను విరమించుకోవాన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న స్థలాన్ని హాస్పిటల్‌కు మంజూరు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ అధికారులతో మాట్లాడాలని డిమాండ్ చేశారు. అఖిల పక్షం చేస్తున్న దీక్షకు ఆందోళలనకు సంఘీభావంగా ఎండి ఉస్మాన్, ఇక్బాల్, నవాబ్, గౌస్, ఇస్మాయిల్, అబ్బు, ఉస్మాన్ అలీ, ఖాజా పాషా,రహీం, సజ్జు, మహబూబ్ అలీ, మహమూద్, రియాజ్ దీక్షలో పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో మళ్లీ విజయం మాదే

మర్రి రాజశేఖర్ రెడ్డి



పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లో మరోసారి గులాబీ జెండా ఎగురవేసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో బోయిన్‌పల్లి మల్లారెడ్డి గార్డెన్స్‌లో నియోజకవర్గ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. ఆకుపచ్చ తెలంగాణే లక్ష్యంగా లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్న ఘనత కేసీఆర్‌దే అన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని ట్రిక్కులు చేసినా రాష్ట్రంలో బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయమన్నారు. సమాధులు తవ్వాలని ఒక్కడు.. భవనాలు కూలుస్తానంటూ మరొకరు మాట్లాడుతున్నారని ప్రతిపక్ష నేతలను ఎద్దేవా చేశారు. తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నె క్రిశాంక్ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్, లాస్య, నివేదిత, శ్రీగణేశ్, జక్కుల మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు.

సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన



నిరసన తెలుపుతున్న సిబ్బంది

అడ్డగుట్ట: రైల్వే కాంట్రాక్ట్ పారా మెడికల్ సిబ్బంది సమస్యలను పరిష్కరించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా రైల్వే కాంట్రాక్ట్ పారా మెడికల్ స్టాఫ్ యూనియన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. కోవిడ్ విపత్కర సమయంలో ప్రాణాలు తెగించి ప్రజలకు సేవలందించిన పారా మెడికల్ స్టాఫ్‌ను విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. తొలగించిన రైల్వే కాంట్రాక్ట్ పారా మెడికల్ తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీఈఎం పోర్టల్ ద్వారా జరుగుతున్న స్టాఫ్ రిక్రూట్‌మెంట్‌ను నిలిపి కాంట్రాక్ట్ పారా మెడికల్ స్టాఫ్‌ను వెంటనే రెగ్యులరైజ్ చేయాలన్నారు. అదే విధంగా రైల్వేలను ప్రైవేటీకరణ చేసే చర్యలను కూడా విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిరసనలో సీఐటీయూ నగర నాయకులు అజయ్ బాబు, అజయ్ బాబు, కుమారస్వామి పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధిపై ఉచిత శిక్షణ

కాచిగూడ: ఉద్యోగ, ఉపాధి అవకాశాలు గల వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు హిందూ శ్మశాన వాటిక ప్రబంధక సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు తెలిపారు. కాచిగూడ, హరాస్‌పెంట శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో యోగా, టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మెహిందీ తదితర కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలోని సెంటర్‌లో సంప్రదించాలన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 23, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 15, క్యారెట్ 28, దొండ 15, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 20, దోసకాయ 18, బీట్‌రూట్ 23, ఉల్లిగడ్డ 10, ఆలుగడ్డ 21, చామగడ్డ 35,కందగడ్డ 40, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 3–4, ముల్లంగి 4–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

నాలుగో అంతస్తు నుంచి కిందపడి మేస్త్రీ మృతి



మృతి చెందిన మేస్త్రీ శ్రీనివాస్



ప్రమాదం జరిగిన భవనం

కంటోన్మెంట్: కనీస జాగ్రత్తలు తీసుకోకుండా చేపట్టిన ఓ భవన నిర్మాణ పనిలో నిమగ్నమైన మేస్త్రీ కిందపడి ప్రాణాలు కోల్పోయిన ఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీనివాస్ (45) 30 ఏళ్ల క్రితమే నగరానికి వచ్చి ఫిరోజ్ గూడలో ఉంటూ తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. భార్య పద్మ, కుమార్తె వర్షిణి, దివ్యాంగుడైన కుమారుడు వర్ధన్, తల్లి కోటమ్మతో కలిసి జీవిస్తున్నాడు. రెండేళ్లుగా బోయిన్‌పల్లికి చెందిన బిల్డర్ మాలాద్రి వద్ద పని చేస్తున్నాడు. డైమండ్ పాయింట్ సమీపంలోని శ్రీనివాస్ జ్యువెల్లర్స్ యజమాని శ్రీనివాస్‌కు సంబంధించిన భవన నిర్మాణ పనులు చేస్తున్నాడు. సోమవారం ఉదయం భవనం నాలుగో అంతస్తుకు ఎలివేషన్ పనుల్లో భాగంగా కర్రల సాయంతో ఏర్పాటు చేసిన నిర్మాణం (గోవా)పైకి ఎక్కి పని చేస్తూ నాలుగో అంతస్తు నుంచి జారీ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. నిర్మాణదారులు బాధితుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించకుండానే గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కనీస జాగ్రత్తలు పాటించకుండానే తన భర్తతో భవన నిర్మాణ పనులు చేయిస్తూ మరణానికి కారకులైన భవన యజమాని శ్రీనివాస్, బిల్డర్ మాలాద్రిలపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య పద్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక ఆసుపత్రిలో చేర్పించి మెరుగైన చికిత్స అందించకుండా, దూరంగా ఉన్న గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు ఆమె ఆరోపిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. భవన యజమాని శ్రీనివాస్ పరారీలో ఉన్నాడు.

చర్యలకు సిద్ధమైన బోర్డు అధికారులు..

ప్రమాద వివరాలు తెలుసుకున్న బోర్డు అధికారులు, అనుమతి లేకుండా కొనసాగుతున్న నిర్మాణంపై చర్యలకు సిద్ధమయ్యారు. నిబంధనలు ఉల్లంఘించి చేపడుతున్న నిర్మాణాన్ని కూల్చేస్తామంటున్నారు. బోర్డు సూచించిన నిబంధనల మేరకు సెట్ బ్యాక్‌లు లేకుండా ప్రమాదకర పరిస్థితుల్లో చేపట్టే నిర్మాణాలను ఉపేక్షించేది లేదంటున్నారు. త్వరలోనే అన్ని వార్డుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని బోర్డు ఉన్నతాధికారులు వెల్లడించారు.

యువతిపై దాడిని అడ్డుకున్న పలువురికి సన్మానం



యువతి ప్రాణాలను కాపాడిన వ్యక్తులను సన్మానిస్తున్న పోలీసులు

అమీర్‌పేట: బోరబండ బంజారానగర్‌లో నడి రోడ్డుపై ఓ ప్రేమోన్మాది కత్తితో యువతిపై చేసిన దాడిని అడ్డుకుని ప్రాణాలు కాపాడిన వ్యక్తులను ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు సన్మానించారు. ప్రేమకు నిరాకరించిందన్న కోపంతో కిషోర్, లక్ష్మి అనే యువతి కళ్లల్లో కారం కొట్టి కత్తితో గొంతు కోసిన విషయం తెలిసిందే. కత్తితో మరోసారి వేటు వేసేందుకు ప్రయత్నిస్తుండగా అక్కడే ఉన్న మారుతి, రాథోడ్ శంకర్, రాథోడ్ రావ్‌జీ నాయక్, సయ్యద్ అజర్‌అలీ, ఆకాష్ అడ్డుకున్నారు. కిషోర్ చేతిలోని కత్తి చూపిస్తూ బెదిరించినా ధైర్యంతో ముందుకు వెళ్లి పట్టుకున్న సదరు వ్యక్తులను ఎస్‌ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు, ఎస్సై ఆంజనేయులు అభినందించి సన్మానించారు. కళ్ల ముందు జరిగే ఇలాంటి దాడులను ఎవరూ ఉపేక్షించరాదన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం



మడ్‌ఫోర్ట్ క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న రామకృష్ణ

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ క్రీడా మైదానాల్లో ఈ నెల 30 నుంచి కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నామని బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ తెలిపారు. మంగళవారం మడ్‌ఫోర్ట్ హాకీ మైదానంలో బోర్డు అధికారులతో కలిసి ఆయన మైదానంలోని మౌలిక వసతులు, క్రీడా సామగ్రి ఏర్పాటు, మైదానాల అభివృద్ధి తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. దేశంలో క్రీడలు అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఖేలో ఇండియా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. సకాలంలో క్రీడల నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాలని బోర్డు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ విభాగం సూపరింటెండెంట్ మహేందర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చౌహాన్, దఫేదార్ రాజేష్, బీజేపీ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బిఎస్. శ్రీనివాస్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్‌దే విజయం



పార్టీ జెండాను ఆవిష్కరించిన బీఆర్ఎస్ నాయకులు

అమీర్‌పేట: బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషు కుమారి అన్నారు.మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన సికింద్రాబాద్ మహబూబ్ ఫంక్షన్ హాల్లో జరిగిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి భారీ ఎత్తున తరలివెళ్లారు. ముందుగా ఎస్‌ఆర్‌నగర్, అమీర్‌పేట చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజల మంచి కోసం పనిచేసే ప్రభుత్వాలను ప్రజలు ఎప్పుడు ఆదరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమంత్‌రావు, సంతోష్, బలరాం, నర్సింహ, ఉమానాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యం పదిలం



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య కేంద్రం సిబ్బంది



అవగాహన ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ వెంకటి

చిలకలగూడ: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్య జీవనం సొంతమవుతుందని చిలకలగూడ యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఫణి అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం యూపీహెచ్‌సీ పరిధిలోని శ్రీనివాసనగర్, మార్కండేయనగర్, వేంకటేశ్వరనగర్, ఫ్రైడే మార్కెట్, ఉప్పరిబస్తీ, షాబాద్‌గూడ తదితర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫణి మాట్లాడుతూ.. దోమల నివారణకు ప్రతి ఒక్కరు తమవంతు కృషి చేయాలని, నీరు నిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని, ప్రతినిత్యం ఇంటితోపాటు పరిసరాలను శుభ్రం చేసుకోవాలని సూచించారు.

మలేరియాను నిర్మూలించాలి ..

అడ్డగుట్ట: ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సాయి శంకర్ మాట్లాడుతూ.. మలేరియా వ్యాధిని అరికట్టేందుకు దోమల నివారణకు కృషి చేయాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను ఉంచకుండా చూసుకోవాలన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే నిర్మూలన సాధ్యం..

బన్సీలాల్‌పేట్: పరిసరాల పరిశుభ్రత, ప్రజల భాగస్వామ్యంతోనే మలేరియా నిర్మూలన సాధ్యమని హైదరాబాద్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మంగళవారం సికింద్రాబాద్ ప్యాట్నీ సమీపంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటి మాట్లాడుతూ.. వర్షాకాలం ముందస్తు మలేరియా పై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని వీధులు, ఇంట్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఈ నీటి వల్లే దోమలు వృద్ధి చెందుతాయన్నారు. జ్వరంతో బాధపడే వారు వెంటనే తమ సమీపంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల ద్వారా తమ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. డా.శ్రీకళ, డా.సుధా మాధవీ, నిరంజన్, నాగరాజు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రావు, సంతోష్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

బీజేపీవి నీచ రాజకీయాలు

● అంసోల్ లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించడం నీచ రాజకీయాలకు నిదర్శనమని బహుజన్ ముక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అంసోల్ లక్ష్మణ్ విమర్శించారు. మంగళవారం ఆయన బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కులం, మతం చిచ్చుతో బీజేపీ గెలవాలనుకోవడం సిగ్గుచేటని కులాల మధ్య చిచ్చుపెట్టి తెలంగాణలో అధికారంలోకి వస్తామనుకోవడం వారికి కలగానే మిగిలిపోతుందన్నారు. జనాభా ప్రాతిపాదికన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీసీ జనగణన చేయాలని దేశవ్యాప్తంగా బీసీలు ఉద్యమిస్తున్నా పట్టించుకోని బీజేపీ, తెలంగాణలో ముస్లింలు, దళితులు, బీసీల మధ్య అల్లర్లకు పన్నుతున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు.